క్లుప్తంగా

మైపాడు పీహెచ్‌సీలో తనిఖీలు

ఇందుకూరుపేట: మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలి శనివారం తనిఖీ చేశారు. వైద్య సేవలు అందిస్తున్న తీరుపై రోగులను ఆరాతీశారు. వైద్యాధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆరుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం తుపాన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి సిబ్బందికి విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

90 మద్యం బాటిళ్ల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద ఎస్సై మహేంద్ర శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వాహనంలో 90 మద్యం బాటిళ్లను గుర్తించారు. వాహనం, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మందులతో క్షయ నివారణ

కోవూరు: క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఇర్ఫాన్, నిరంజన్ తెలిపారు. ఇనమడుగు పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా వారానికిపైగా దగ్గు ఉంటే పీహెచ్‌సీలో గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అన్ని పీహెచ్‌సీల్లో క్షయకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పౌష్టికాహారం సైతం అందజేస్తుందని చెప్పారు. మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కే నరసమ్మ, టీవో ఎస్కే దిలీప్, ఎంపీహెచ్ఓ రమణ, ఆశ వలంటీర్లు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి

ఇందుకూరుపేట: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏపీ కన్స్యూమర్‌రైట్స్ ప్రొటక్షన్ ఫోరం కోవూరు డివిజన్ మహిళా కార్యదర్శి రజిత, ఇందుకూరుపేట మండల మహిళా అధ్యక్షురాలు పావని అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై శనివారం వారు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

విడవలూరు: కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా, దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణకు చర్యలు చేపట్టేందుకు మండల స్థాయిలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సెల్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వైద్యారోగ్య సిబ్బంది, ఇతర అధికారులను సమన్వయం చేసుకుంటూ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పారిశుధ్య సమస్య ఉంటే 99492 39492 నంబర్‌కు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని ఈఓపీఆర్డీ నారాయణ శాస్త్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెంకటాచలం: ఆగిఉన్న మోటారు సైకిల్‌ను మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సర్వేపల్లి నుంచి వెంకటాచలం వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి వర్షంతో తన మోటారు సైకిల్‌ను రోడ్డుపై ఆపి చెట్ల కిందకు వెళ్లాడు. అదే మార్గంలో మరో మోటారు సైకిల్‌పై వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడగా నెల్లూరుకు తరలించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్‌సీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉంటే ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అనంతరం పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీలకు కంప్యూటర్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లలిత, ఏవీ ప్రసాద్, కంపూటర్ ఫ్యాకల్టీ విద్యుల్లత, శార్వాణి, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను అందజేయండి

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని ఏపీ టిడ్కో (జీ + 3) గృహాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. అల్లీపురంలో ప్రభుత్వ గృహ నిర్మాణాలను హౌసింగ్ విభాగాధికారులతో కలిసి శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు అందించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

సచివాలయాల్లో తనిఖీ

6 / 1, 2, 7 / 3 పప్పులవీధి, 9 / 1 కుసుమ దళితవాడ వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో గృహాలపై సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

• 20వ డివిజన్ కొండాయపాళెం సమీపంలో గల చంద్రికానగర్‌లో కాలువలు, రోడ్ల నిర్మాణాలపై అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు చంద్రయ్య, ప్రసాద్, చాణక్య, ఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి చేయూత

నెల్లూరు(దర్గామిట్ట): కోవూరులోని గంగవరం ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.మూడు లక్షల విరాళాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు తన నివాసంలో శనివారం అందజేశారు. మాజీ ఎంపీటీసీ మురళీకృష్ణ, హరిబాబు, మల్లికార్జున, హజరత్, శీనయ్య, జనార్దన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజలను వేడుకగా నిర్వహిస్తున్నారు. శీవేలి ఉత్సవం, విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా శనివారం చేపట్టారు. ఉభయకర్తలుగా సిద్ధవరపు కామాక్షమ్మ, పార్వతమ్మ, మధుసూదన్‌రెడ్డి, సుహాసిని వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో 195 మంది ఎంపిక

నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టిక్నాలజీలో మెగా జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ రాణాప్రమోద్‌రెడ్డి మాట్లాడారు. 12 కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాకు 500 మంది విద్యార్థులు హాజరుకాగా, 195 మంది ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారు త్వరగా చేరాలని కోరారు. డీన్లు మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి భానుచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్ భవనానికి మరమ్మతులు చేయండి

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ప్రెస్‌క్లబ్ నిర్వహణకు అవసరమైన మరమ్మతు పనులను చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్పందనలో ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు వినతిపత్రాన్ని అందించిన తరుణంలో కమిషనర్ పరిశీలించారు. భవనంలో దెబ్బతిన్న గదులు, పైకప్పునకు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులను చేపట్టాలని పేర్కొన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా తదితరులు పాల్గొన్నారు.



ఓటు నమోదుపై అవగాహన

నెల్లూరు (టౌన్): జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్ఐఓ శ్రీనివాసరావు కోరారు. ఓటు నమోదుపై కృష్ణచైతన్య, రావూస్, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 13 వరకు కొనసాగనుందని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ తదితర పోటీలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. తుపాన్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు సెలవును సోమవారం ప్రకటించామన్నారు. ఇంటర్ పరీక్షకు సంబంధించిన ఫీజు గడువును ఈ నెల ఐదు వరకు పొడిగించారని తెలిపారు. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు జోజీ, విజయకళ, కృష్ణచైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ రామాంజనేయులురెడ్డి, నాగయ్య, రావూస్ జూనియర్ కళాశాల సీఈఓ శివారెడ్డి, ప్రిన్సిపల్స్ శ్రీనివాస్, షరీఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వేడుకగా ప్రాకారోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు విశేషంగా హాజరై మూలస్థానేశ్వరుడ్ని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా కలువాయి శ్రీనివాసులురెడ్డి, పావని, శ్రీనివాసులురెడ్డి, భవాని దంపతులు వ్యవహరించారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బారకాసు): ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను శనివారం అందజేశారు. ట్రంక్ రోడ్డు సమీపంలోని స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెప్మా పీడీ రవీంద్ర మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులైన మహిళలను పొదుపు సంఘాల్లో చేర్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో మెప్మా సిబ్బంది అండగా ఉంటారని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి యస్దానీ, సిటీ మిషన్ మేనేజర్లు పెంచలయ్య, జరీనా తదితరులు పాల్గొన్నారు.



ఏబీవీపీ నేతల నిరసన



నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు వీఆర్సీ సెంటర్‌లో నిరసనను ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. నేతలు నరసింహ, రాబర్ట్, వినోద్, నవీన్, మదన్, బాలాజీ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లో రేపటి 'స్పందన' రద్దు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్లో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని తుపాన్ కారణంగా రద్దు చేశారు. ఈ మేరకు కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

ఎడతెరపిలేని వర్షం

నెల్లూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం శనివారం కురిసింది. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నగర శివారు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తూరు పరిధిలోని చంద్రబాబునగర్, రెవెన్యూ కాలనీ, చవటమిట్ట గిరిజన కాలనీ, శ్రామికనగర్, వైఎస్సార్ నగర్, తిరుమలనగర్, బుజబుజనెల్లూరు పరిధిలోని ఆర్టీసీ కాలనీ, తల్పగిరి కాలనీ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



నెల్లూరు(దర్గామిట్ట): ఇందుకూరుపేట మండలంలోని మైపాడుకు చెందిన క్రీడాకారుడు కటారి యాదగిరికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. థాయ్‌లాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన యాదగిరి ఆర్థికంగా కష్టాలు పడుతున్నారు. విషయాన్ని శ్రీహరికోట ప్రసాద్ ద్వారా తెలుసుకున్న ఎంపీ ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఊటుకూరు సుబ్బయ్య, బాబు, నరేంద్ర బాబు, మస్తాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బాలికతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను ఆమె తండ్రికే పంపి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఘటనలో నిందితుడ్ని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం నగరానికి మూడేళ్ల క్రితం వచ్చారు. గుప్తా పార్క్ సమీపంలోని ఓ స్కూల్ భవన నిర్మాణ పనులు చేస్తూ పెద్ద కుమార్తెతో కలిసి అక్కడే ఓ గదిలో ఉంటున్నారు. ఈయన వద్ద ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలానికి చెందిన అశోక్ పనిచేస్తున్నారు. రూ.రెండు లక్షల అడ్వాన్స్ తీసుకొని కొంతకాలం పనిచేసి ఎవరికీ చెప్పకుండా జమ్మలమడుగు వెళ్లిపోయారు. రూ.60 వేలను ఇవ్వాల్సి ఉండటంతో గత నెల 23న యజమాని వెళ్లి అశోక్‌ను నిలదీశారు. పది రోజుల్లో ఇస్తానని చెప్పారు. ఈ క్రమంలో యజమాని కుమార్తెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను ఆయనకే పంపారు. అందరికీ పంపుతానని బెదిరించారు. దీంతో కుమార్తెను నిలదీయగా బలవంతంగా ఫొటోలు తీసుకున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అశోక్‌పై పోక్సో కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో శనివారం హాజరుపర్చారు.


విద్యారణ్య భారతి నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న జేసీ దంపతులు




ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న మంత్రి కాకాణి, చిత్రంలో ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల

కనులపండువగా..

నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీక మాస లక్ష దీపోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరైన అశేష భక్తజనం కార్తీక దీపాలను వెలిగించి తన్మయత్వం చెందారు. శివలింగానికి భక్తులు అభిషేకాలు చేశారు.

– నెల్లూరు(బృందావనం)




శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


వీణాగాన ప్రదర్శన

ఎంపీకి పవిత్రాల అందజేత

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను ఇటీవల నిర్వహించిన నేపథ్యంలో పవిత్రాలు, ప్రసాదాలను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి శనివారం అందజేశారు. దేవస్థాన చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకాలను జరిపారు. ఉభయకర్తలుగా సరాబు వెంకటసుబ్బారావు, ధనలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు గుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సినిమాలకు హబ్‌గా సింహపురి

నెల్లూరు(బృందావనం): సినిమాలకు నెల్లూరు హబ్‌గా మారిందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గుంటూరు మిర్చి సినిమా స్క్రిప్ట్‌నకు పూజలను నగరంలోని రంగనాథస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఎ స్సార్ – 2 ప్రొడక్షన్స్ పతాకంపై ఆషిక్ హీరోగా నవీన్ దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. నెల్లూరు, పరిసరాల్లో ప్రస్తుతం 20కుపైగా చిత్ర షూటింగ్‌లు జరుగుతున్నాయని తెలిపారు. ఆనందభారతి, హాస్య నటులు చిట్టిబాబు, దోర్నాల హరిబాబు, మూవీ అసోసియేషన్ నేతలు ఆశిష్, మురళీకృష్ణారెడ్డి, బన్నీ, వెంకటేష్, నారాయణబాబు, నటరాజ్, మధు, షార్ట్ ఫిల్మ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, కళా సంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


క్లాప్ కొడుతున్న కృష్ణారెడ్డి

కూలీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలి

నెల్లూరు(పొగతోట): ఉపాధి పనులు కూలీల సంఖ్యను పెంచేది కాదని.. వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేవని డ్వామా పీడీ వెంకట్రావ్ పేర్కొన్నారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీకి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పనులను గుర్తించాలని సూచించారు. సమావేశానికి హాజరైన ఉద్యోగులు నమోదు చేసుకోకుండా ఉండటంతో వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. రానున్న రోజుల్లో ఆహారోత్పత్తుల పరిశ్రమలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, హార్టికల్చర్ పంటల సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ పంటలను సాగు చేయడం ద్వారా మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను చెల్లించనున్నారని వెల్లడించారు. రోడ్డు సైడ్ కెనాల్ ప్లాంటేషన్స్‌పై దృష్టి సారించాలన్నారు.


మాట్లాడుతున్న వెంకట్రావ్

2024 – 25 ఆర్థిక సంవత్సరంలో పూడికతీత పనులే కాకుండా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులను గుర్తించాలని ఆదేశించారు. మునగ, డ్రాగన్ ఫ్రూట్ తదితర హార్టికల్చర్ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. డ్వామా అడిషనల్ పీడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.